బతుకు తెరువు



శివలెంక భాంధ్యావేశి

అమ్మ మరీ మరీ చెప్పింది. నే బయల్దేరుతూంటే—బస్సుదిగగానే వాడికోసం చూడు, వస్తాడు. ఒకవేళ రావడం కొంచెం ఆలస్యమయినా కాసేపాగు అక్కడే వాడు వచ్చేవరకూ. ''తెలీక పోతుందా'' అని అడ్డం పడిపోకు. కాని వూరు పల్లెటూరు కూడాను. అందరూ ఎబ్బెట్టుగా చూస్తారని. ''అలాగే'' అన్నట్లు తల తాటించాను. అయినా మళ్ళీ చెప్పింది. ''అలాగేలేవే'' అన్నానీసారి విసుగ్గా.

జాగ్రత్త, కానివూరు. అన్నారు నాన్న?

"మరేం ఫరవాలేదు" అన్నట్లు నవ్వాను. వచ్చేశాను.

బస్సు దిగగానే అవన్నీ గుర్తొచ్చాయి అన్నయ్య కోసం చుట్టూ చూశాను. కని పించలేదు.

రోడ్డు మీదకు వచ్చి నాలుగు పక్కలా చూశాను. అన్నయ్య కనిపించలేదు. నా వెనకాత లెవరో వొకాయన వస్తున్నాడు. ఆయన దగ్గరకు వచ్చేవరకూ ఆగాను.

రోడ్డుకు అడ్డంగా నిలబడ్డ పిల్లని— నావంక ఆశ్చర్యంగా, వింతగా చూశాడు.

"కామరాజు వారి వీధెక్కడండి." అని అడిగాను ఆయన ఆశ్చర్యాన్ని గుర్తించనట్లు.

"ఎవరిల్లు కావాలి?" కనుబొమలు చిట్లిస్తూ అడిగాడు.

"సుబ్బారావని .." నామాట పూర్తి కాలేదు.

వారింటికా తమరు దయచేసింది. ఏ వెధవని తీసుకు వెళ్ళి దిగబెట్ట మన్నా దిగ బెడతాడు కదండీ. వారింటికి, వీధి పేరు వెతుక్కొంటున్నారు. అంటూ సంభ్రమంగా నవ్వి ముందుకు దోవ తీశాడు నా వెనుక రమ్మన్నట్లు.

వెనకాతలే జాగ్రత్తగా దోవని పరిశీ లిస్తూ నడుస్తున్నాను. ఎంతైన వొంటరి ఆడపిల్లని మరి.

నాలు గడుగులు వేసి ఏదో ఘోరాప రాధం జరిగిపోయినట్లు నొచ్చుకొంటూ అన్నాడు వెనుదిరిగి.

"అదేదో మీరు పట్టుకొన్నారు. ఇటి వ్వండి నేను పట్టుకొంటాను" అని.

"నే పట్టుకొంటాను, నాది నాకు బరువు ..."నామాట పూర్తి కాకుండానే.

"ఎంత మాట . ఎంతమాట ..మీ కేవిటా అవసరం ." అంటూ సూటు కేసు తన చేతిలోకి తీసుకొన్నాడు. నా యిష్టంతో ప్రమేయం లేనట్లు ఆ మని షితో ఏంమాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలీక మౌనంగా వెనకాలే నడవడం మొదలు పెట్టాను.

కొంతదూరం నడిచాక "మనదే వూరు?" అన్నాడు నడక వేగం తగ్గించి. మా పనిచేసే వాళ్ళుకూడా అంత విన యంగా మాట్లాడటం నేనెరుగను.

"కృష్ణా జిల్లాలే" అన్నాను

"అద్దదీ, అట్లా సెప్పండీ" అన్నాడు ఏదో సరికొత్త విషయం పరిశోధించి నట్లుగా—ఆ మాటెందు కన్నాడో నా కర్థం కాలేదు.

"చూస్తానే తెలుస్తుంది లెండి" అన్నాడు.

"ఏం తెలుస్తుందని" నే నడగలేదు.

"ఇంకొక రెండు ఫర్లాంగులుంది. మీ చేత యింతదూరం నడిపించాం." అన్నాడు ఎంతో అపరాధం చేసినట్లు. బల వంతాన నవ్వు ఆపుకొన్నాను.

"అన్నయ్యకీ, ఆ మనిషికీ ఏవిటీ పరి చయం?" నా ఆలోచనలో నేనుండగానే



"అదిగో ఆ కన్పిస్తున్న ఇల్లే వారిది" అన్నాడు.

మొగుడు పేరు ఉచ్చరించని ఆడవాళ్ల జ్ఞాపకం వచ్చారు నాకు.

"అంటే" అన్నాను ఏమంటాడోనని.

"అయ్యగారిది" అన్నాడు.

"అంటే—సుబ్బారావుగారిదా?" అని అడిగాను నవ్వు దాచుకొంటూ.

"మరేనండి. ఏం చేస్తే ఋణం తీరుతుంది అయ్యగారికి. ఇంత చిన్న వయసులోనే ఎంత ఋద్ధి—పూర్వజన్మ సుకృతం" అన్నాడు.

ఈ జన్మని గాలిలోకి వదిలేసి, పూర్వజన్మ గురించి మాట్లాడే ఆ మనిషికి ఏం చెప్పను?

ఇంటిముందుకొచ్చాక తలుపు తట్టాడు, "అమ్మగారూ" అంటూ. చామనచాయగా వున్నామె తలుపు తీసింది. "దండాలమ్మగారూ" అన్నాడు రెండుచేతులూ పైకెత్తి దణ్ణం పెడుతూ,

అట్టే పట్టించుకోకుండా "రండి లోపలకు" అన్నది నాతో.

ఆ మనిషి వెళ్లిపోయాడు సూట్‌కేసు లోపల పెట్టి.

"ఛాయ వస్తుంది, బస్టాండుకి వెళ్ళాలని నిన్నటినుంచీ ఒకటే తొందర పడుతున్నారు. తీరా ఆవేళ్టికి ఎవరో అర్జెంటుగా పిల్చుకువెళ్ళారు." అన్నది కుర్చీ

జరుపుతూ.

"పోన్లెండి, అతనెవరో తీసుకు వచ్చాడు" అన్నాను ముఖానికి పట్టిన చెమట తుమాలుతో తుడుచుకొంటూ.

"తీసుకురావడానికేం ఎవరయినా తీసుకువస్తారు, సరి మీ అన్నయ్య పలుకు బడి...." అంటూ అర్ధోక్తిగా ఆపి నవ్వింది.

"ఎప్పుడు వస్తాడు?" అన్నాను.

"రావచ్చు—ఎప్పుడైనా," ఏమం టున్నా ఆవిడ ముఖంలో నవ్వుమటుకు దాగటంలేదు,

"స్నానం చెయ్యండి, భోంచేసి తరు వాత మాట్లాడుకోవచ్చు" అన్నది.

"స్నానంచేసి వస్తాను, భోజనం అన్నయ్య వచ్చాక చేద్దాము" అన్నాను స్నానానికి లేస్తూ.

"అన్నయ్య భోంచేసి వస్తారు" అన్నది.

స్నానం చేసివచ్చాను. భోజనందగ్గర తనే ఏదో మాట్లాడుతోంది. "మా పెళ్లి కూడా మీరెవరూ రాకుండానే అయి పోయింది" అన్నది.

"పెద్దన్నయ్య పెళ్ళికూడా సరిగా అప్పుడే. రావడానికి వీల్లేకపోయింది" అన్నాను. సంభాషణ తెంపేసినట్లు అక్కడ ఆగిపోయింది.

భోంచేసి వచ్చి ముందుగదిలో కూర్చు న్నాను పేపరు చూస్తూ. ఆవిడ వంటిల్లు సర్దుకుంటోంది. దబ్రున తలుపు తోసుకు లోపలకు వచ్చాడు అన్నయ్య. చూసి నిర్ఘాంతపోయాను.

ముఖం నిండా విభూతి, దానిమీద గంధం. ఇంతపెద్ద కుంకుమబొట్టు—

ఇలాంటి కర్మకాండను అసలు నమ్మని అన్నయ్య—

"ఏమిట్రా ఈ అవతారం?" అని మటుకు అనగలిగాను.

"ఇందులో నా ప్రమేయమేం లేదు. కాని, నువ్వెప్పుడొచ్చావో చెప్పు ముందర" అంటూ వాకిలితలుపు దగ్గరగా వేసి, వేరే కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

నే నామాట పట్టించుకోలేదు, "నీకు అమ్మ తన రక్తమాంసాలు ధారపోసి చదువు చెప్పించింది యిందుకోసమట్రా, నిన్నుగురించి కలవరిస్తూనే చచ్చి పోయింది, ఇదిట్రా నువ్వు చేస్తున్న నిర్వాకం" అన్నాను. భగ్గుమంటోంది నా గుండె.

"పెద్దలు చెప్పే ఆత్మలనేవి నిజంగా వుంటే, అమ్మ సంతోషిస్తుంది, నే నీ నాటికైనా ఏదో విధంగా బతకగలుగు తున్నందులకు" అన్నాడు తాపీగా—ఏ నాడో చచ్చిపోయిన అమ్మను తలచు కొంటూ.

"ఒరేయ్! నీ దొంగ వేషాలన్నీ చచ్చిపోయిన వాళ్ళ ఆత్మలంటూ వాటి వెనకాల దాచిపెట్టాలనుకోకు. అమాయకు లైన ప్రజల్ని దోచుకు తింటున్నారని, ఒకనాడు కంఠశోష పడ్డ నువ్వు— ఇవాళ ఇలా తయారయావంటె నమ్మ లేక పోయానురా. చదివిన చదువంతా

పట్టేట్లో కలిపి .... వన్‌వే ట్రాఫిక్ లా వుంది నీ గొడవ. అంటూనే ఫక్కున నవ్వేడు, ఆ నవ్వే నన్ను రెచ్చగొట్టింది.

"ఏవిట్రా...."అన్నాను. నా తల బిరుసు, పొగరు అంతా అందులో వాడికి తెలుసుండాలి.

చిన్నప్పుడు నాకోసం దెబ్బలు తిన్న వాడు వాడు. పెట్టుబడిదారి విధానం, సాటి ప్రజల్ని దోచుకునే విధానం నశించాలని వాడు కోషోచ్చేలాగు వాదిస్తూంటే వాడిని బలపరచి, చివాట్లు తిన్న దాన్ని నేను. అందుకనే నేమో, వాడు తేలికగా నవ్వ గలిగాడు.

'నా వాదన కూడా విను. తెలివిగా, బతుకు మీద ఎంతో ఆశతో, వున్నదేదో వూడ్చుకొని, అమ్మ చచ్చిపోయిందన్న విచారాన్ని కూడా దిగమింగి, బియస్సీ పరీక్షలు అయాయనిపించి, పాసయాను, అంటే — జీవిత సమరంలోకి దూకా వన్నమాట. అన్నీ దెబ్బలే. పెట్టుబడి దారి విధానం నశించాలి, యువతరానికి ప్రోత్సాహం కావాలి" అని వాదించే వాడిని గుర్తుందా....

అందుకని అమాయక పల్లె ప్రజల్ని మోసం చేస్తావా నీకు నమ్మకం లేని విషయాన్ని అధారం చేసుకొని. నాకోపం-ఎంత ఆపుకోందామన్నా ఆగటంలేదు.

"చెల్లాయ్! అని అరిచాడు వాడు. అందులో బాధ స్పష్టంగా కనిపించింది.

"నే నెవర్నీ మోసం చేయడంలేదే! నేనేనే బతుకులో మోసగింప బడింది ...

"అలాగా" నా గొంతులో వ్యంగ్యం ఆగలేదు.

"అవును. ఏం, నా యిష్టం వచ్చి నట్లు నే సంపాదించు కొంటాను. వద్దనే వాళ్లు వేరే వుద్యోగం చూపెట్టండి. ఇది మానేస్తాను, సామాన్య మానవుడ్ని. ఆకలిబాధ వుంది నాకు. డిన్నర్లలో, టీపార్టీలలో పీకలమొయ్యాతిని. 'నారేషను బియ్యం త్యాగం చేస్తున్నాను' అడే అవకాశం లేదు నాకు. ఆ బియ్యమే గతి. వాటికోసం ఏ పాట్లైనా పడాలి"

నాలోని వేడి దిగిపోవటం ప్రారంభించింది.

"అందుకని" అన్నాను.

"అందుకని" నన్ను అనుకరిస్తూ, "నాకు చేతనైనది నేను చేసుకొంటాను. నీకు తోచింది....

"బాబుగారూ మీమేలు మరిసిపోలేను. అంటూ తలుపు తోసుకొని ఒకతను లోపలకు వచ్చాడు. చేతిలోని మంచి గుమ్మడిపండు అన్నయ్యకాళ్ళ దగ్గిర పెట్టాడు.

"దాందేముందిలే" అన్నట్లు ఒక చిఱునవ్వు నవ్వాడు అన్నయ్య.

"ఎలా వుందిరా మీ అన్నకు.... అని అడిగింది వదిన లోపల్నుంచి వస్తూ.

బాబుకాదు తల్లీ ....భగమంతుడు. భగమంతుడు దయవలన నయమైపోనాది. చిన్నవాడైనా చేతులెత్తి మొక్కాలి తల్లీ! ఆడు ఆ సావుకేసు పట్టినప్పటి నుంచి నిద్దరోయినాడా, మమ్మల్ని నిద్దరో విచ్చినాడా? కలవరింతలు, కేకలు,

పిడుపులు, లగె_త్తటాలు ఒకటేమిటి తల్లీ, మమ్మల్ని రచ్చించారు తల్లీ, బాబు ఇల్లు సల్లగా, మీకడుపు సల్లగా....

"పైకాన్ని తొందరగా సర్దమనిచెప్పు అవసరంగా వుంది." సగం నిర్లక్ష్యంగా, సగం అధికారంగా అన్నాడు.

"అలాగేనయ్యా. ఆడు డూటిలోకి ఎళ్ళగానే" ఒక చెయ్యి గాలిలోకి విదిలించేసి, చప్పరించేశాడు. అన్నయ్య అవన్నీ నాకెందు కన్నట్లు. "వెళ్ళి మీ అన్నతో చెప్పు ముందర నేనన్న విషయం" అన్నాడు.

"సిత్తం బాబూ తమరు మళ్ళీ ఒక సారి దయసేసి...."

"అలాగే నేనే అనుకొంటున్నానా విషయం, రేపు పొద్దున్న వస్తాను. అన్నీ సిద్ధంచేసి వుంచమను.కొ_త్తవేమి అక్కర లేదు. అన్నీ లోగడ తెచ్చినవే, మీ అన్నను కూడా స్నానం చేసి సుచిగా వుండమను" అంటూ నావైపు తిరిగాడు. నాకు మండిపోతోంది.

"దండాలు బాబూ" అంటూ వెళ్ళి పోయాడతను.

వాడొక పోలీసు. చావుకేసు పట్టాడు. కక్కుర్తిపడి తప్పుడు సాక్ష్యాలిప్పించాడు. చచ్చినవాడె ఆ స్తిచంపినవాడికి పోయింది. గుట్టు చప్పుడు కాకుండా. వాడు దెయ్యమై పట్టాడని పీడికి భ్రమ.

"లేని దెయ్యాన్ని వదిలిస్తానని చెప్పి "

"నువ్వు మాట్లాడకు — నీకీ మను ష్యుల ఏదు తెలీదు" అన్నాడు. కను బొమలెత్తి నా వంకే చూస్తూ అన్నాడు మళ్ళీ: "నేను కాకపోతే, యింకొకరు— ఆశాస్త్ర తతంగం పూర్తిచేస్తేనే కాని వాడి మనసు కుదుట పడదు. మళ్ళీ మనిషి కాడు. అలాటప్పుడు ఏవో ఆదర్శాలు వల్లేసుకొంటూ, సిద్ధాంతాలు గుర్తు తెచ్చు కొంటూ కూర్చుంటే ఏం లాభం? కడుపులో ఆకలి తప్ప మిగిలేదేం వుండదు.

"తెలివుంటె తాయెత్తులు కట్టి బత కొచ్చు ఈ దేశంలో" అని ఒకసారి నువ్వే అన్నావుటగా. అదే చివరికి శరణ్య మయింది. మీ అన్నయ్యకు" వదిన అన్నది. నవ్వుతోంది తమాషాగా.

"అదా. రోగం స్పష్టంగా కని పిస్తూంటే ఏదో ఒక డాక్టరు దగ్గర నయం కాలేదని భూతవైద్యులకోసం తిరుగుతున్నవారిని చూసి అనకేం చేయను. అక్కడికీ చెప్పాను. యింకొక మంచి స్పెషలిస్టుకు చూపించమని ఊరుకోలేక."

"పెళ్ళికి ముందరే పాపం ప్రేమలో పడ్డారు. 'సంపాదన లేందే పెళ్ళి చేసు కొని ఏం చెయ్యాలి, వీల్లేదు పొమ్మంది' ఆ అమ్మాయి. అప్పుడు పాపం గొప్ప చిక్కులో పడ్డారు. సంపాదనకోసం వివిధ మార్గాల్ని అన్వేషించసాగింది చురుకుగా బుర్ర. అప్పుడు నీ ఉపదేశం గుర్తొచ్చింది. ఏవో నాలుగు పుస్తకాలు చదివారు, నాలుగు రకాల మనుష్యుల్ని కలుసు కొన్నారు. అంతే! ఊరూ-పాడా, కట్టూ-బొట్టూ మార్చేశారు. నిత్యం జపం చేయడం మొదలుపెట్టారు. ఏ జపం

యువ

చేసేవారో, ఏ దేవి నామస్మరణ చేసే వారో మన కనవసరం.''

''ఈ దేవిని పెట్టుకొని యింకో దేవి నామస్మరణ ఎందుకు'' అన్నయ్య.

అడుగుల చప్పుడు వినిపించి మాటలు ఆపేశాడు. తలుపు తోసుకువచ్చింది ఒక పల్లెటూరు స్త్రీ.

''బాబుగారో బిడ్డకు నయమైపోనాది. డాట్టరు మందొద్దన్నా రిక. మీ మేలు మరిపిపోలేను. ఏంటివ్వను మీకు. ఏం టుంది నా కాడ—''

''ఏం వద్దు లచ్చీ. బిడ్డ కోలుకొంది. అంతే చాలు. పో ఇంటికి పో. పిల్ల ఒక్కర్తే వుండుంటుంది'' అన్నాడు. కొంగుముడి విప్పి అన్నయ్య చేతిలో రెండు రూపాయలు పెట్టబోయింది.

వాడి కళ్ళలోని వాత్సల్యం నన్ను కదిలించి వేసింది. ''ఆ డబ్బుపెట్టి పిల్లకు రెండురోజులు పళ్ళు కొనిపెట్టు. ఏవన్నా అవసరమయితే మొహమాట పడక వచ్చి తీసుకుపో'' అంటున్నాడు. ''ఏదో నా తృప్తికోసం.''

''చూడు లచ్చీ! ఆ రెండు రూపాయలూ లేకపోతే నాకు గడవకపోటం లేదు. నీకు అక్కఱకు వుపయోగిస్తాయి. ఇదే మరి నీ బాబుగారికి తృప్తి.'' వాడు ఆశయాలంటూ వాదిచ్చినప్పటి కళ్ళలోని తళుక్కు యిప్పుడు చూడగలిగేను. వెళ్ళి పోయిందామె మళ్ళీ మళ్ళీ కృతజ్ఞతలు తెలుపుకొంటూ.

''ప్చ్! ఎంత నికృష్టపు బతుకులో, తలొసలాగా వెల్లకు మందిప్పించలేక భూత వైద్యమన్నా చేయిద్దామని నా దగ్గరకు తీసుకువచ్చింది. ఆరోజు వాళ్ళను చూస్తే గుండెలో కెలికినట్లయింది.ముందు డాక్టరు దగ్గరకు పంపాను'' వాడి కళ్ళు ఎక్కడో చూస్తున్నాయి. ఆ చూపులను ఒక లాంటి శూన్యత ఆవరించుకొంది.

''మరి అలా చేస్తూంటె నీ దగ్గరకేం వస్తారిక.'' నాలోని కుతూహలం నన్నాగ నివ్వలేదు.

''అందుకూ ఏదో తంతుచేశారు ..'' వదిన.

''వేప మండలూ, నిమ్మకాయలూ అంటూ కూర్చోక ఒక ప్రాణాన్ని నిలప గలిగావే'' మధ్యలోనే అడ్డుకొన్నవదిన. ''ఇది మామూలే'' అన్నది. ఇంతలో ఎవరో వచ్చారు. అన్నయ్య బైటికి వెళ్ళి పోయాడు.

అంతవరకూ మాట్లాడుతూంటె తెలీ లేదు కాని, అప్పుడు అలసటగా అన్పించింది. పక్కగదిలోకి వెళ్ళాను. గోడకు మడతమంచం ఆన్చి కన్పించింది వాల్చు కొని, దిండు—దుప్పటి వేసుకొని పడు కొన్నాను. నిద్రపట్టడం నాకు తెలియదు.

సాయంత్రం పొద్దు వాలిపోతూండగా మెలకువ వచ్చింది. చల్లని గాలి కిటికీ లోంచి వచ్చి శరీరాన్ని తాకుతూ, హాయిని కలిగిస్తోంది. కిటికీ అవతల మాటలు వినిపిస్తున్నాయి. అటుచూశాను,అన్నయ్య కూలీలతో మాట్లాడుతున్నాడు. ఇటుకల బండ్లు నిలిపి వున్నాయి పక్కన. ఇల్లు కడుతున్నాడు అన్నయ్య!